
సాక్షి
పల్నాడు
మంగళవారం ၊ 30 ၊ మే ၊ 2023



ఏపీఎస్పీ డీఐజీగా రాజకుమారి

మంగళగిరి: ఏపీఎస్పీ ఆరో బెటాలియన్ కొత్త డీఐజీగా బి.నాగరాజకుమారి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. పలువురు ఆమెను అభినందించారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం సోమవారం 520.60 అడుగుల వద్ద ఉంది. ఎస్ఎల్‌బీసీకి 1,350 క్యూసెక్కులు విడుదలవుతోంది.



పాలిసెట్ కౌన్సెలింగ్ ప్రారంభం

గుంటూరు ఎడ్యుకేషన్: పాలిసెట్ కౌన్సెలింగ్, సర్టిఫికెట్ల పరిశీలన ప్రక్రియ సోమవారం గుంటూరు శివారు నల్లపాడులోని ఎంబీటీఎస్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ప్రారంభమైంది.

ఫోర్ ద పీపుల్

సంక్షేమ సర్కారు నాలుగేళ్ల ప్రస్థానమిదీ..

- అభివృద్ధి పథంలో ఉమ్మడి గుంటూరు
- పిడుగురాళ్ల, బాపట్లలో మెడికల్ కళాశాలలు
- నిజాంపట్నం, వాడరేవుల్లో ఫిషింగ్ హార్బర్‌లు
- కొత్తగా ఆక్వా యూనివర్సిటీ మంజూరు
- గుంటూరు చానల్ విస్తరణ
- వరికపూడిసెల ఎత్తిపోతలకు లైన్ క్లియర్

ప్రజాకంటకులపై సంచలన విజయంతో నవ్యాంధ్ర సింహాసనంపై సంక్షేమ పతాకను సగర్వంగా రెపరెపలాడించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విప్లవాత్మక పాలనతో జన హృదయాలపై చెరగని ముద్రవేశారు. నవరత్నాలు పొదిగిన ప్రగతి రథాన్ని పరుగులు పెట్టించారు. ప్రపంచాన్ని అతలాకుతలం చేసిన కరోనా మహమ్మారి వ్యాప్తి పీచమణిచి జన జీవితాలకు రక్షగా నిలిచారు. కరవు కాటకాలు రాష్ట్ర దరిదాపుల్లోకి రాకుండా పారదోలారు. సుభిక్ష, సుస్థిర పాలనతో 'ఆదర్శ'ప్రదేశ్‌ను సాక్షాత్కరింపజేశారు. రాష్ట్ర చరిత్రలోనే సువర్ణాధ్యాయాన్ని లిఖించారు. నాలుగేళ్లూ ఫర్ ద పీపుల్ అనే పదానికి నిలువెత్తు నిదర్శనమై జయజయధ్వానాలు అందుకున్నారు. కుట్రలు, కుయుక్తులతో ఏకమైన దుష్టచతుష్టయంపై యుద్ధం ప్రకటించి ప్రజలతోనే తన ప్రయాణమని ఎలుగెత్తిచాటారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో పరిపాలన వికేంద్రీకరణతో నవశకానికి నాంది పలికారు. అభివృద్ధి ఫలాలు అందరి దరిచేర్చి వరాల సిరులు కురిపించారు.

సాక్షి ప్రతినిధి, గుంటూరు: ఉమ్మడి గుంటూరు జిల్లా అభివృద్ధి ముఖచిత్రంపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి బలమైన ముద్రవేశారు. ఫలితంగా సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా ఉమ్మడి జిల్లా ప్రగతి పథాన దూసుకెళుతోంది. రెండేళ్లు కరోనా సంక్షోభం వెంటాడినా ప్రభుత్వం వెనుకంజ వేయలేదు. అందరికీ తక్షణ వైద్యం అందేలా చర్యలు తీసుకుంది. అంతటి కష్టకాలంలోనూ పేదలు ఎలాంటి ఇబ్బంది పడకూడదనే ఉద్దేశంతో సంక్షేమ పథకాలతో ఆర్థిక ఆసరా కల్పించింది. వైఎస్సార్ సీపీ అధికారం చేపట్టిన వెంటనే వలంటీరు, గ్రామ సచివాలయ వ్యవస్థలను ప్రవేశపెట్టి ప్రజల ముంగిళ్లలోకే వెళ్లి తలు తట్టి మరీ ప్రగతి, సంక్షేమ ఫలాలను అందించింది. విద్యా రంగంలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టింది. మనబడి నాడు–నేడు పథకం ద్వారా ఉమ్మడి జిల్లాలోని 1,183 పాఠశాలలను 289 కోట్ల రూపాయలతో ఆధునికీకరించింది. వసతులు కల్పించింది. పరిపాలనా సౌలభ్యం కోసం గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాలుగా విభజించి అభివృద్ధికి చర్యలు చేపట్టింది. గుంటూరు నగరాన్ని రూ. 300 కోట్లతో సుందరంగా తీర్చిదిద్దేందుకు నడుంకట్టింది.

గుంటూరు వైద్య కళాశాలకు మహర్దశ

గుంటూరు వైద్య కళాశాల అభివృద్ధిపై ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక దృష్టిసారించారు. నాడు–నేడు ద్వారా రూ. 500 కోట్లు మంజూరు చేశారు. ఈ నిధులతో వైద్య కళాశాల, కళాశాలకు అనుబంధంగా ఉన్న గుంటూరు జీజీహెచ్, ఛాతి సంబంధిత వ్యాధుల ఆస్పత్రి రూపు రేఖలు మారనున్నాయి. ఇటీవల 40 పీజీ సీట్లు వైద్య కళాశాలకు మంజూరయ్యాయి. దీనికోసం కావాల్సిన వైద్య సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వం రూ. 40.8 కోట్లు విడుదల చేసింది.

బాపట్లలో రూ.505 కోట్లతో వైద్య కళాశాలను నిర్మించనున్నారు. దీనికి సంబంధించి గత ఏడాది ఏప్రిల్ 27న ప్రభుత్వం పరిపాలనా అనుమతులు జారీ చేసింది. దీని కోసం 51.07 ఎకరాల్లో జమ్ములపటం, మూలపాలెం సరిహద్దుల్లో భూమిని సేకరించారు. సాయిల్ టెస్టులూ పూర్తయ్యాయి. త్వరలోనే పనులు ప్రారంభించేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. అలాగే నాడు–నేడు ద్వారా ప్రాథమిక వైద్యశాలల ఆధునికీకరణకు చర్యలుచేపట్టింది. దీని కోసం రూ.49.24 కోట్లు ఖర్చు చేసింది.



జన హృదయాలు సంబర'పడవ' : అభివృద్ధి కానున్న నిజాంపట్నం హార్బర్

గుంటూరు చానల్ విస్తరణతో 75వేల ఎకరాలకు మేలు

గుంటూరు చానల్ విస్తరణకు ప్రభుత్వం ఆమోదముద్ర వేసింది. ఈ పనులు పూర్తయితే 48 వేల ఎకరాల కొత్త ఆయకట్టుకు సాగునీరు అందుతుంది. మల్లాయపాలెం, కాకుమాను మేజర్ల కింద ఉన్న 9, 600 ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ సాధ్యమవుతుంది. కాలువల సామర్థ్యం పెరుగుతుంది. దీనివల్ల మరో 17,400 ఎకరాలకు సాగునీరు అందుతుంది. మొత్తంగా 75వేల ఎకరాలకు సాగునీటి కష్టాలు తీరతాయి. ఈ పనుల కోసం 274.53 కోట్ల రూపాయలతో పరిపాలనా అనుమతులు వచ్చాయి. ఈ పనులను మెగా ఇంజనీరింగ్ సంస్థకు అప్పగించారు. భూసేకరణ కోసం 113.39 కోట్ల రూపాయలు ఖర్చు అవుతుందని అంచనా వేశారు. దీని కోసం ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ కూడా జారీ చేసింది.

తీరంలో ప్రగతి తరంగాలు

తీరంలోనూ ప్రగతి తరంగాలు ఎగసి పడుతున్నాయి. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, నాబార్డు సహకారంతో నిజాంపట్నం ఫిషింగ్ హార్బర్‌ను రూ.450 కోట్లతో ఆధునికీకరిస్తున్నారు. వాడరేవులో రూ. 450 కోట్లతో ఫిషింగ్ హార్బర్, నిజాంపట్నంలో 180 కోట్లతో ఆక్వా యూనివర్సిటీకి ఇటీవలే ముఖ్యమంత్రి శంకుస్థాపన చేశారు.

సంక్షేమ సిరులు

నవరత్నాల ద్వారా ఇంటింటా సంక్షేమ సిరులు కు రుస్తున్నాయి. ఇప్పటివరకు 91 లక్షల మంది లబ్ధిదారులకు రూ.30వేల కోట్లమేర ప్రయోజనం చేకూరింది.

విజయీ'భవన్'

ప్రభుత్వ భవనాల నిర్మాణమూ వేగంగా సాగుతోంది. పంచాయతీరాజ్ శాఖ ద్వారా 311 సచివాలయ భవనాలు, 138 రైతు భరోసా కేంద్రాలు, 346 స్కూల్ ప్రహరీ పనులు, 96 వైఎస్సార్ క్లీనిక్‌లు 627 కోట్ల రూపాయల అంచనాతో పూర్తయ్యాయి. 139 బల్క్‌మిల్క్ యూనిట్లు, 165 వైఎస్సార్ డిజిటల్ లైబ్రరీ భవనాల నిర్మాణం పురోగతిలో ఉంది.

'ఇంటి'గ్రేట్


పేదలందరికీ ఇళ్లు పథకంలో భాగంగా మూడు లక్షల మంది పేదలకు లబ్ధి చేకూరింది. వీరి కోసం 6,660 ఎకరాల భూమిని సేకరించారు. 1240 కోట్ల రూపాయల ఖర్చుతో అభివృద్ధి చేసి పేదలకు కేటాయించారు. ఇళ్ల నిర్మాణం వేగంగా సాగుతోంది. తాజాగా రాజధానిలోనూ 50,793 మందికి ఇళ్ల స్థల పట్టాలు ఇచ్చారు.

శరవేగంగా కొత్త వైద్యకళాశాల నిర్మాణం



పిడుగురాళ్ల మండలం కామేపల్లి శివారులో 47.54 ఎకరాల విస్తీర్ణంలో రూ.500 కోట్లతో చేపట్టిన మెడికల్ కాలేజీ నిర్మాణ పనులు వేగంగా సాగుతున్నాయి. డిసెంబర్ 2023 నాటికి పనులు పూర్తవుతాయని అధికారులు చెబుతున్నారు.. ఈ కళాశాల పూర్తయితే అత్యాధునిక వైద్య సదుపాయాలు అందుబాటులోకి వస్తాయి. వంద ఎంబీబీఎస్ సీట్లు మంజూరయ్యే ఆస్కారం ఉంది.

వరాల వరికెపూడిసెల



వరికపూడిసెల ఎత్తిపోతల పథకం నిర్మాణానికి రూ.340 కోట్లతో చేపట్టిన పనులు పురోగతిలో ఉన్నాయి. ఈ పథకం నిర్మాణంతో పల్నాటి ప్రాంత వాసుల ఏడు దశాబ్దాల కల తీరనుంది. ఈ పథకానికి కేంద్రం నుంచి అనుమతులూ రాష్ట్ర ప్రభుత్వం సాధించింది. ఈ ఎత్తిపోతల పూర్తయితే 73 వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు పుష్కలంగా అందుతుంది. నూజెండ్ల మండలంలో 10 వేల ఎకరాలకు సాగునీరు అందించేందుకు రూ.95 కోట్లతో ఐదు ఎత్తిపోతల పథకాల నిర్మాణానికి సర్వే పూర్తయింది.

న్యూస్‌రీల్

స్పందన అర్జీల పరిష్కారానికి కృషి

జాయింట్ కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్



నరసరావుపేట: జగనన్నకు చెబుదాం (స్పందన) కార్యక్రమంలో వస్తున్న అర్జీల పరిష్కారానికి అధికారులు కృషిచేయాలని జాయింట్ కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ ఆదేశించారు. కలెక్టరేట్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ హాలులో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించారు. తొలుత జిల్లా రెవెన్యూ అధికారి కె.వినాయకం, ట్రైనీ కలెక్టర్ కల్పశ్రీలతో కలిసి జేసీ ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం జిల్లా నలుమూలల నుంచి తరలివచ్చిన ప్రజలు 170 మంది తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ జాయింట్ కలెక్టర్, డీఆర్వోలకు వినతి పత్రాలను అందజేశారు. స్వీకరించిన వినతులను అధికారులకు అందజేసి పరిష్కారమయ్యేలా చూడాలని జాయింట్ కలెక్టర్ ఆదేశించారు. నరసరావుపేట మండలంలోని ఇక్కుర్రు జగనన్న లేఅవుట్‌లో స్థలం కోసం దరఖాస్తు చేసుకున్న ఎనిమిది మంది ట్రాన్స్‌జెండర్లకు పట్టాలను అందజేశారు. దూర ప్రాంతాల నుంచి వచ్చిన అర్జీలదారులకు రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో దాత వైవీఆర్ ఫౌండేషన్ వెంకటరత్నం భోజన సదుపాయం కల్పించారు. జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ, ప్రకృతి వ్యవసాయ విభాగం ఆధ్వర్యంలో స్టాల్స్ ఏర్పాటు చేశారు.

ఆక్రమించిన పొలాన్ని విడిపించండి

పూర్వ కాలం నుంచి సాగుచేసుకుంటున్న భూమిని గ్రామంలోని కొంతమంది వ్యక్తులు అధికారుల సహకారంతో ఆక్రమించి మట్టితోలారు. ప్రశ్నించిన వారిపై దాడికి పాల్పడి కులం పేరుతో దూషించారు. వారిపై చర్యలు తీసుకుని పొలాన్ని విడిపించండి.

– బాధితులు, రేగులగడ్డ, మాచవరం మండలం

జూన్ 5న వేద పాఠశాల పునఃప్రారంభం

పట్నంబజారు(గుంటూరు): గుంటూరు మారుతి నగర్‌లోని కంచి కామకోటి పీఠ మారుతీ ఆలయ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆర్ష ధర్మ సమితి వేద స్మార్త సంస్కృత శాస్త్ర పాఠశాల జూన్ 5 నుంచి పునఃప్రారంభమవుతుందని ఆలయ కార్యదర్శి తంగిరాల శ్రీనివాస్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జూన్ 5 నుంచి అధ్యయన తరగతులు నిర్వహిస్తామని పేర్కొన్నారు. వేద పాఠశాలలో చేరేందుకు ఉపనయనం పూర్తి అయి ఉండి 8 ఏళ్ల నుంచి 11 ఏళ్లలోపు వయస్సు కలిగిన వారే అర్హులని తెలిపారు. మరిన్ని వివరాల కోసం 9848872729 నంబరును సంప్రదించాలని వెల్లడించారు.

15 మందికి ఎంపీడీఓలుగా ఉద్యోగోన్నతి

గుంటూరు ఎడ్యుకేషన్: ఉమ్మడి గుంటూరు జిల్లాలో 15 మందికి ఎంపీడీఓలుగా ఉద్యోగోన్నతి కల్పిస్తూ రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ ఎ. సూర్యకుమారి శనివారం రాత్రి ఉత్తర్వులు విడుదల చేశారు. జెడ్పీ, మండల పరిషత్ కార్యాలయాల్లో పని చేస్తున్న పరిపాలనాధికారులతోపాటు ఈఓపీఆర్డీలకు తాత్కాలిక విధానంలో ఎంపీడీఓలుగా ఉద్యోగోన్నతి కల్పించిన ప్రభుత్వం వారికి గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లో పోస్టింగ్‌లు ఇచ్చింది. జెడ్పీ, మండల పరిషత్ కార్యాలయాల్లో ఏవోలుగా పని చేస్తున్న జి.శ్రీనివాసరావు, బి.మహేష్‌బాబు, బి.శ్రీనివాసరావు, బి. మారుతి శేషాంబ, కె.శివపార్వతి, ఎంకే చక్రపాణి ప్రసాద్, కె.శ్రీనివాసరావుతో పాటు ఈవో పీఆర్డీలుగా చేస్తున్న కె. సమతా వాణి, కె. ప్రభాకరరావు, ఏవీ రంగనాయకులు, పి. రామకృష్ణ, యూబీ వరప్రసాద్, టి. వీరభద్రాచారి, పి.శివ సుబ్రహ్మణ్యం ఎంపీడీవోలుగా ఉద్యోగోన్నతి పొందారు. ఇదిలా ఉంటే బదిలీల కోసం దరఖాస్తు చేసుకునేందుకు జెడ్పీ ఉద్యోగులకు ఈనెల 31 వరకు గడువు ఉంది.

బాలుడి హత్య కేసులో నిందితులకు జీవితఖైదు

గురజాల: బాలుడి హత్య కేసులో నిందితులకు జీవిత ఖైదు, రూ. 2వేల జరిమానా విధిస్తూ పదో అదనపు జిల్లా జడ్జి గాజుల వెంకటేశ్వర్లు సోమవారం తీర్పు చెప్పారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ నాగిరెడ్డి కథనం ప్రకారం.. మాచవరం మండలం మల్లవరం గ్రామానికి చెందిన బాలుడు బాలాజీ అలియాస్ బన్నిని 2015 మే 9న కొందరు కిడ్నాప్ చేసి రూ. 15 లక్షలు డిమాండ్ చేశారు. బంధువులు రూ.15 లక్షలు ఇవ్వలేకపోవడంతో బాలుడిని హత్య చేశారు. ఈఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేసిన పోలీసులు నిందితులు వినుకొండ తిరుపతిరావు, పోతుల బోయిన మహేష్, వినుకొండ శ్రీనివాసరావు అలియాస్ శ్రీను, వినుకొండ అలియాస్ ఏడుకొండలును అరెస్టు చేశారు. కోర్టులో వాదోపవాదాల అనంతరం నిందితులపై రుజువు కావడంతో పై విధంగా న్యాయమూర్తి తీర్పు చెప్పారు. అప్పటి పిడుగురాళ్ల రూరల్ సీఐ వై.శ్రీధర్‌రెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు.

ఎన్నికల్లో టీడీపీకి 'సమాధే'

- పేదలకు మేలు జరుగుతుంటే ఓర్వలేరా
- ఇళ్ల స్థలాలను సమాధులతో పోలుస్తారా?
- ప్రజలే చంద్రబాబుకు బుద్ధి చెబుతారు
- రాష్ట్రవైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని ధ్వజం
- చంద్రబాబు విద్వేషపూరిత వ్యాఖ్యలకు నిరసగా భారీ బైక్ ర్యాలీ



చిలకలూరిపేటలో జరిగిన భారీ బైక్ ర్యాలీ



ప్రదర్శనలో పాల్గొన్న మంత్రి విడదల రజిని

చిలకలూరిపేట: పేదలకు మేలు జరుగుతుంటే చంద్రబాబు చూసి ఓర్వలేక పోతున్నారని, పేదల పట్ల ఆయనకు ఎందుకు అంత విద్వేషమని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని మండిపడ్డారు. పేదలకు పంపిణీ చేసే ఇళ్ల స్థలాలను చంద్రబాబు నాయుడు సమాధులతో పోల్చడాన్ని నిరసిస్తూ వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో పల్నాడు జిల్లా చిలకలూరిపేటలో సోమవారం భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. ముందుగా పట్టణంలోని ఎన్ఆర్‌టీ సెంటర్ నుంచి, అడ్డరోడ్డు, కళామందిర్ సెంటర్, మీదుగా వైఎస్సార్ సీపీ కార్యాలయం వరకు బైక్ ర్యాలీ సాగింది. భాస్కర్‌సెంటర్లోని డాక్టర్ వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి మంత్రి నివాళి అర్పించారు. వైఎస్సార్ సీపీ నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున ప్రదర్శనలో పాల్గొన్నారు. అనంతరం మంత్రి విడదల రజిని మాట్లాడుతూ పేదలంతా జగనన్న వెంటే ఉన్నారని తెలిసి చంద్రబాబునాయుడు రగిలిపోతున్నారని విమర్శించారు. అవకాశం వచ్చిన ప్రతిసారీ పేదలపై పగతీర్చుకునేందుకు చంద్రబాబు యత్నిస్తూనే ఉన్నారని దుయ్యబట్టారు. పేదల ఆత్మగౌరవాన్ని పెంచుతూ వారికి జగనన్న ఉచితంగా ఇళ్ల స్థలాలు ఇస్తున్నారని వెల్లడించారు. అలాంటి ఇళ్ల స్థలాలను చంద్రబాబు సమాధులతో పోల్చడం అత్యంత దుర్మార్గమని ధ్వజమెత్తారు. సమయం వచ్చినపుడు పేదలే చంద్రబాబుకు బుద్ధి చెబుతారని స్పష్టం చేశారు. పేదల ఇళ్లు అంటే ఆయనకు ఇంత చిన్నచూపా అని ప్రశ్నించారు. చంద్రబాబు వ్యాఖ్యలు ఆయన పెత్తందారీ మనస్తత్వానికి నిదర్శనమని మండిపడ్డారు. ఆయన అధికారంలో ఉన్నప్పుడు జన్మభూమి కమిటీలను నియమించి ఆ కమిటీలతో పేదలపై పెత్తనం చేయించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. జగనన్న వలంటీర్ వ్యవస్థను తీసుకువచ్చి పేదల ఇళ్ల వద్దకే ప్రభుత్వ సేవలు అందేలా చూస్తున్నారని వివరించారు. పేదలపై పెత్తనం చేసే పార్టీ టీడీపీ అని పేర్కొన్నారు. పేదల కోసం పనిచేసే పార్టీ వైఎస్సార్ సీపీ అని చెప్పారు. ప్రజలందరికీ ఈ విషయం తెలుసునని, ఇప్పుడు చంద్రబాబు నాయుడు మహానాడు పెట్టి.. ఆ సభలో పేదలపై లేని ప్రేమ నటిస్తున్నారని విమర్శించారు. అధికారం ఉన్నప్పుడు ఒకలా.. లేనప్పుడు మరోలా నటించడం ఒక్క చంద్రబాబుకే సాధ్యం అవుతుందని ఆరోపించారు. అధికారంలో ఉన్నప్పుడు పేదల అభ్యున్నతి కోసం ఒక్క సంక్షేమ పథకాన్ని అమలు చేయని చంద్రబాబు నేడు ఇతర పార్టీల మేనిఫెస్టోలు కాపీ కొట్టి వాటిని అమలు చేస్తాననడం విడ్డూరంగా ఉందని వెల్లడించారు. అధికారంలో ఉన్నప్పుడు గుర్తుకు రాని పేదలు ఇప్పుడు ఎందుకు గుర్తు వచ్చారా అని ప్రశ్నించారు. పేదలను ధనికులను చేస్తానని, సంపద సృష్టిస్తానని గారడీ మాటలు చెబుతున్నారని ఎద్దేవా చేశారు. పేదలకు రాజధాని ప్రాంతంలో ఇళ్లస్థలాలు ఇవ్వడాన్ని వ్యతిరేకిస్తూ తన అనుచరులతో న్యాయస్థానాలను ఆశ్రయించి ఇళ్ల పట్టాల పంపిణీని అడ్డుకునేందుకు సర్వశక్తులు ఒడ్డిన చంద్రబాబుకు పేదలే గుణపాఠం చెబుతారని స్పష్టం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ తోట రాజేంద్రప్రసాద్, ఎంపీపీలు దేవినేని శంకరరావు, పిడతల ఝాన్సీ, తలతోటి రాణి, జెడ్పీటీసీ సభ్యులు కాట్రగడ్డ మస్తాన్‌రావు, కోడె సుధారాణి, రాష్ట్ర ముస్లిం సంచార జాతుల కార్పొరేషన్ డైరెక్టర్ షేక్ దరియావలి, వైఎస్సార్‌సీపీ నాయకులు విడదల గోపీనాథ్, పఠాన్ తలహాఖాన్, గుత్తా యాములయ్య, గంటా శంకర్, మద్దూరి కోటిరెడ్డి, షేక్ అల్లీమియా, షేక్ అబ్దుల్‌గని, బేరింగ్ మౌలాలి, మున్సిపల్ కౌన్సిలర్లు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

జూన్ 2న ముఖ్యమంత్రి గుంటూరు పర్యటన

కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి



అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వేణుగోపాల్ రెడ్డి, చిత్రంలో జేసీ రాజకుమారి

గుంటూరు వెస్ట్: వైఎస్సార్ యంత్ర సేవా పథకంలో భాగంగా గుంటూరులోని చుట్టుగుంటలో జూన్ 2న జరగనున్న వ్యవసాయ ఉపకరణాల పంపిణీ కార్యక్రమానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి రానున్నారని కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి తెలిపారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ మినీ సమావేశ మందిరంలో నిర్వహించిన అధికారుల సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని, అధికారులందరూ సమష్టిగా సమన్వయంతో పనిచేయాలని సూచించారు. రెండో విడతగా 793 ట్రాక్టర్లు, 38 హార్వెస్టర్లు రైతులకు పంపిణీ చేయనున్నట్టు వివరించారు. ఈ కార్యక్రమానికి ఎన్టీఆర్, గుంటూరు, పల్నాడు, బాపట్ల, పశ్చిమ గోదావరి, ఏలూరు, కృష్ణ, ప్రకాశం జిల్లాల నుంచి రైతులు పెద్ద సంఖ్యలో హాజరవుతారని వెల్లడించారు. పారిశుద్ధ్యం, ట్రాఫిక్, వాహనాల పార్కింగ్, మంచినీటి సదుపాయం ఏర్పాటు చేయాలని తెలిపారు. గత ఏడాది కూడా ఈ కార్యక్రమం నిర్వహించిన నేపథ్యంలో అధికారులు ఆ అనుభవంతో ముందుకెళ్లాలన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి, డీఆర్వో చంద్రశేఖరరావు, అడిషనల్ ఎస్పీ సుప్రజ, డిప్యూటీ కలెక్టర్ లలిత, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

'విద్య'యోస్తు

- బడులు తెరిచిన రోజే జగనన్న విద్యాకానుక
- జిల్లాలో 1.82 లక్షల మందికి కిట్లు
- ఇప్పటికే స్టాక్ పాయింట్లకు 40శాతం వస్తువులు సరఫరా
- నాణ్యత పరిశీలనకు మండలస్థాయి కమిటీలు

జిల్లాలో ఇలా..	
మొత్తం ప్రభుత్వ పాఠశాలలు	: 1,634
విద్యార్థుల సంఖ్య	: 1,82,702



జేవికే కిట్ స్కూల్ బ్యాగ్

నరసరావుపేట ఈస్ట్: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న విద్యార్థులకు అందించే జగనన్న విద్యా కానుక(జేవికే) కిట్ల నాణ్యతకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది. ఎక్కడా చిన్న పొరపాట్లకు కూడా తావు లేకుండా బడి తెరిచిన రోజే విద్యార్థులకు కిట్లు అందజేయాలని భావిస్తోంది. ఈ దిశగా చర్యలూ చేపడుతోంది.

కిట్‌లో ఉండే పాఠ్య పుస్తకాలు, నోట్ బుక్స్, వర్క్ బుక్స్, డిక్షనరీ, బ్యాగ్, మూడు జతల స్కూల్ యూనిఫాం, షూస్, సాక్స్‌లు, బెల్ట్(మొత్తం 9 వస్తువులు) నాణ్యతపై పరిశీలనకు మండల స్థాయిలో కమిటీలను ఏర్పాటు చేసింది. ఈ కమిటీలో ఎంఈఓ, సమగ్ర శిక్ష ఇంజినీర్, ఏపీఎంఓ సభ్యులుగా ఉంటారు. రాష్ట్రస్థాయి వెండర్లు ఈ కమిటీకి ముందుగా తమ వస్తువులను నాణ్యత పరిశీలన కోసం పంపుతారు. ఈ కమిటీ పరిశీలించి నివేదిక ఇచ్చిన అనంతరం వెండర్లు వస్తువులు పంపుతారు. వచ్చిన వస్తువులను మళ్లీ ఈ కమిటీ పరిశీలిస్తుంది. పూర్తి నాణ్యతతో ఉంటేనే పాఠశాలలకు సరఫరా చేసేందుకు అనుమతి ఇస్తుంది. నాణ్యత లోపించిన వస్తువులను తిరిగి పంపే అధికారం కూడా మండల స్థాయి అధికారులకు ప్రభుత్వం ఇచ్చింది. దీంతో ఈ మేరకుజిల్లా అధికారులు చర్యలు చేపట్టారు. జిల్లావ్యాప్తంగా ఉన్న 1.82,702 మంది విద్యార్థులకు పాఠశాలలు తెరిచిన రోజే జగనన్న విద్యా కానుక కిట్లు అందించేందుకు సమగ్ర ప్రణాళిక సిద్ధం చేశారు.

బయోమెట్రిక్ పద్ధతిలో పంపిణీ

ఇప్పటికే 40 శాతం వరకు జేవికే కిట్లు మండలాల్లోని స్టాక్ పాయింట్లకు చేరుకున్నాయి. ఈ వస్తువుల నాణ్యత పరిశీలన కూడా పూర్తయింది. మిగిలిన జూన్ మొదటి వారంలో రానున్నాయి. కిట్లు పూర్తిగా వచ్చిన తర్వాత పాఠశాలలకు సరఫరా చేస్తారు. పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, పేరెంట్స్ కమిటీ సభ్యులు, ప్రజా ప్రతినిధుల ద్వారా విద్యార్థులకు అందజేస్తారు. వచ్చిన వస్తువులు పక్కదారి పట్టకుండా బయోమెట్రిక్ పద్ధతిలో పంపిణీ చేస్తారు.

నాణ్యతలో రాజీ లేదు



విద్యార్థులకు అందించే జగనన్న విద్యా కానుక వస్తువుల నాణ్యతలో రాజీ లేదు. నాణ్యత పరిశీలనకు మండల స్థాయిలో ఎంఈఓ, ఏపీఎంఓ, సర్వశిక్ష ఇంజినీర్ సభ్యులుగా కమిటీలను ఏర్పాటు చేశాం. వచ్చిన స్టాక్‌లో ర్యాండమ్‌గా ఐదు శాతం పరిశీలించి నాణ్యతను వీరు నిర్ధారిస్తారు. నాణ్యత లోపిస్తే తిరిగి వెనక్కి పంపుతాం. పాఠశాలలు తెరిచిన రోజే కిట్లు అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం.

– కె.శామ్యూల్, డీఈఓ.

జేవీకే కిట్లకు ఇండెంట్ ఇలా..

స్కూల్ బ్యాగ్‌లు	: 1,82,702
బెల్ట్‌లు	: 1,28,047
డిక్షనరీలు	: 35,442
నోట్‌బుక్స్	: 10,37,516
షూస్ జత	: 1,82,702
యూనిఫాం జతలు	: 1,82,702

(వీటిల్లో ఇప్పటికే మొదటి విడతగా 40శాతం స్టాక్‌పాయింట్లకు చేరాయి. జూన్ మొదటి వారంలో రెండో విడతలో మిగతావి రానున్నాయి.)

కుమారుడి హత్య కేసులో తండ్రి అరెస్ట్

నకరికల్లు: కొడుకు హత్య కేసులో తండ్రిని అరెస్ట్ చేసినట్లు సత్తెనపల్లి రూరల్ సీఐ సీహెచ్ కోటేశ్వరరావు తెలిపారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. గుండ్లపల్లికి చెందిన బి.వీరయ్యకు కుమార్తె, కుమారుడు అశోక్(25) ఉన్నారు. వీరయ్య భార్య అలివేలు ఉపాధి కోసం కువైట్‌లో ఉంటోంది. కుటుంబానికి రూ.4లక్షల విషయంలో తండ్రీకొడుకులు తరచూ మద్యం తాగి గొడవ పడుతుండేవారు. ఈనెల 25న అర్ధరాత్రి సమయంలో కొడవలితో అశోక్(25)ను హత్యచేశాడు. తలను సంచిలో వేసుకొని వీధుల్లో తిప్పి తలను ఘటనా స్థలంలోనే పడేసి పారిపోయాడు. సోమవారం నకరికల్లు వస్తున్నాడన్న సమాచారం మేరకు స్థానిక కారంపూడి అడ్డరోడ్డు వద్ద నిందితుడు వీరయ్యను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. మృతుడి భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు చెప్పారు. కేసు ఛేదించడంలో కృషిచేసిన ఎస్‌ఐ పి.సురేష్, సిబ్బందిని అభినందించారు.

వదిలించుకోవాలని చూస్తున్నారు...

- జగనన్నకు చెబుదాంలో ఓ మహిళ ఫిర్యాదు
- బాధితుల నుంచి అర్జీలు స్వీకరించిన ఎస్పీ రవిశంకర్‌రెడ్డి
- 53 ఫిర్యాదులు స్వీకరణ

'ఈపూరు మండలం కొచ్చర్లకు చెందిన మహిళకు నాలుగేళ్ల క్రితం వివాహమైంది. ఇద్దరు ఆడపిల్లలు పుట్టారు. రూ.2లక్షలు కట్నం తీసుకున్నారు. అదనంగా డబ్బులు తీసుకురావాలని వేధిస్తున్నారు. బంధువుల యువతితో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడు. ఆడపిల్లలు పుట్టారంటూ అత్త వేధిస్తోంది. పుట్టింటి నుంచి నన్ను కాపురానికి తీసుకెళ్లట్లేదు' ఓ మహిళ ఎస్పీ స్పందనలో ఫిర్యాదు చేసింది.

నరసరావుపేట: జిల్లా పోలీస్ కార్యాలయంలో జగనన్నకు చెబుదాం కార్యక్రమం సోమవారం నిర్వహించారు. కార్యక్రమానికి జిల్లా ఎస్పీ రవిశంకర్‌రెడ్డి బాధితుల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. 53 ఫిర్యాదులు స్వీకరించారు. స్పందన కార్యక్రమానికి వచ్చిన ప్రజలకు వారి ఫిర్యాదులను రాసిపెట్టడంలో పోలీస్ సిబ్బంది సహాయసహకారాలు అందించారు. తమ సమస్యలు విన్నవించుకునేందుకు విచ్చేసిన ప్రజలకు నరసరావుపేట పట్టణానికి చెందిన బచ్చు సత్య కిషోర్, నాగమల్లికల వివాహ వార్షికోత్సవం సందర్భంగా ఉచిత అన్నదానం చేయగా, జిల్లా ఎస్పీ, అధికారులు, ఇతర అధికారులు, ఆర్గనైజర్ బచ్చు వెంకట సత్యనారాయణ, ఊర భాస్కరరావు స్వయంగా భోజనాలు వడ్డించారు. క్రైమ్ అదనపు ఎస్పీ ఎస్.కె.చంద్రశేఖర్, ఏఆర్ అదనపు ఎస్పీ డి.రామచంద్రరాజు, డీఎస్పీలు కె.వి.మహేష్, రవిచంద్ర, బి.ఆదినారాయణ, పల్లపురాజు, ఏఆర్ డీఎస్పీ చిన్నికృష్ణ పాల్గొన్నారు.



బాధితురాలి సమస్య వింటున్న జిల్లా ఎస్పీ రవిశంకర్‌రెడ్డి

మా డబ్బులు ఇప్పించి న్యాయం చేయండి

వ్యాపార నిమిత్తం డబ్బులు అప్పుగా కావాలని ఒక మహిళ తన వద్ద రూ.86 వేలు, మరో మహిళ వద్ద రూ.3.5 లక్షలు తీసుకుంది. మా డబ్బులు మాకు తిరిగి ఇవ్వమని కోరగా ఆ మహిళ స్పందించడం లేదు. జోక్యం చేసుకొని డబ్బులు మాకు ఇప్పించాలని వినతి.

– ఒక మహిళ, సత్తెనపల్లి

స్థలం కొంటామని డబ్బులు తీసుకొని ఇవ్వట్లేదు..

నా భర్త ఏడేళ్ల క్రితం పాము కాటుతో చనిపోయాడు. నాకు ముగ్గురు పిల్లలు, నా పేరు మీద స్థలం కొంటామని చెప్పి నా భర్త అకౌంట్లో ఉన్న రూ.7.5 లక్షలు మరిది, బాబాయి వరుసయ్యే వ్యక్తి తీసుకొని ఇంతవరకు డబ్బులు ఇవ్వకుండా, స్థలం కొనుగోలు చేయకుండా ఇబ్బందులు గురిచేస్తున్నారు. న్యాయం చేయాలి.

–ఓ వివాహిత మహిళ, పిల్లుట్ల, మాచవరం మండలం

విదేశాల్లో చదువు కోసం బెదిరిస్తున్నారు

మనవడి చదువు కోసం అమెరికా పంపించాలని రూ.25 లక్షలు ఇవ్వమని కొడుకు, కోడలు ఇబ్బంది పెడుతున్నారు. ఇప్పటికే రూ.15 లక్షలు ఇచ్చా. ఇంకా డబ్బులు ఇచ్చే స్తోమత లేదని చెబుతున్నా వినకుండా బెదిరిస్తున్నారు. వారిపై చర్యలు తీసుకోండి.

–ఓ మహిళ, ఇక్కుర్తి గ్రామం, నరసరావుపేట మండలం

గుర్తింపులేని పాఠశాలలపై చర్యలు: డీఈఓ శామ్యూల్

నరసరావుపేట ఈస్ట్: పల్నాడు జిల్లా పరిధిలో ప్రభుత్వ గుర్తింపు లేకుండా నడుపుతున్న పాఠశాలలను గుర్తించి వాటిపై చర్యలు తీసుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారి కె.శామ్యూల్ సోమవారం ఆదేశించారు. అనుమతి లేకుండా నడిపే ప్రీ ప్రైమరీ, ప్రైమరీ, అప్పర్ ప్రైమరీ, హైస్కూళ్లను మూసివేయాలని తెలిపారు. ప్రతి పాఠశాల ప్రభుత్వ గుర్తింపుతోనే నడపాలని చెప్పారు. ప్రభుత్వ గుర్తింపు లేకుండా పాఠశాలలు నిర్వహిస్తున్నట్లయితే మండల విద్యాశాఖాధికారులు, ఉప విద్యాశాఖాధికారులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ప్రజలను మోసం చేయటమే చంద్రబాబు నైజం

- కాపీ కొట్టినవే మహానాడు వాగ్దానాలు
- విలేకర్ల సమావేశంలో ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి



నరసరావుపేట: ప్రజలను మోసం చేయటమే టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబునాయుడి నైజమని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. సోమవారం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. మహానాడు సందర్భంగా వచ్చే ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని చంద్రబాబు ప్రజలకు చేసిన వాగ్దానాలు నెరవేర్చని సుష్కవాగ్దానాలుగా అభివర్ణించారు. కర్ణాటక రాష్ట్రంలో అక్కడి కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన మానిఫెస్టోను మక్కీకి మక్కిగా కాపీ కొట్టి ప్రజలపై వదిలాడన్నారు. ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని మరోసారి ప్రజలను మోసం చేసేందుకు సిద్ధమయ్యాడన్నారు. పార్టీని స్థాపించి ముఖ్యమంత్రిగా చేసిన ఎన్‌టీ రామారావునే మోసం చేసి పార్టీని లాక్కున్న వ్యక్తికి ప్రజలను మోసం చేయటం ఒక లెక్కకాదని వివరించారు. ఉద్యోగాల వాగ్దానాన్ని ప్రస్తావిస్తూ జాబు కావాలంటే బాబు రావాలంటూ గోడలపై రాసి నిరుద్యోగులకు ఆశ కల్పించి ఓటేయించుకొని తీరా అధికారంలోకి రాగానే వారిని మర్చిపోయి లోకేశ్‌కు దొడ్డిదారిన రెండు మంత్రి పదవులు ఇచ్చుకున్నాడని చెప్పారు. ఇచ్చిన మాటను చిత్తుకాగితం లాగా పక్కన పడేసే చంద్రబాబును నమ్మటం కంటే విశ్వసనీయతనే నమ్ముకున్న సీఎం జగన్ లాంటివారిని నమ్మాలని ప్రజలను కోరారు.

సీఎం వైఎస్ జగన్ నాలుగేళ్ల పాలన భేష్

- ఎమ్మెల్సీ జంగా, ఎమ్మెల్యే బొల్లా



వినుకొండ(నూజెండ్ల): నాలుగేళ్ల పరిపాలనలో ఇచ్చిన హామీలు 98 శాతం అమలు చేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి అన్నారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడుతో కలసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అభివృద్ధి సంక్షేమం విషయంలో ఎక్కడా రాజీ లేకుండా రాష్ట్రాన్ని నడిపిన ముఖ్యమంత్రికి దేశంలో ఎక్కడా లేని విధంగా పరిపాలన చేశారన్నారు. అలాగే బడుగు బలహీన వర్గాల వారికి పదవుల్లో ప్రాధాన్యం ఇచ్చారని గుర్తు చేశారు. ఎమ్మెల్యే బొల్లా మాట్లాడుతూ ముఖ్యమంత్రి సహాయ సహకారాలతో వినుకొండ నియోజకవర్గంలో వందల కోట్ల నిధులతో అభివృద్ధి చేస్తున్నట్లు చెప్పారు. 600 హామీలు ఇచ్చి 2 శాతం కూడా అమలు చేయలేని చంద్రబాబు తిరిగి మేనిఫెస్టో పేరుతో ప్రజలను మరోసారి మోసం చేస్తున్నరని ప్రజలు నమ్మవద్దని సూచించారు. పల్నాడు జిల్లా దాచేపల్లి మండలం గామాలపాడులో ఈనెల 7న జరిగే పల్నాడు నాగమ్మ శైవక్షేత్రం చెన్నమల్లికార్జు స్వామి ఆలయ నిర్మాణానికి రావాలని ఎమ్మెల్యే బొల్లాకు జంగా కృష్ణమూర్తి ఆహ్వాన పత్రికను అందజేశారు.